సాక్షి ప్రకాశం

మంగళవారం | 23 | మే | 2023



చిత్తశుద్ధితో స్పందించండి

స్పందనలో వచ్చే అర్జీలపై చిత్తశుద్ధితో స్పందించి పరిష్కరించాలని డీఆర్వో శ్రీలత సూచించారు. కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించారు.

- 8లో..



వేలిముద్రలు పడకుంటే ఐరిష్

బయోమెట్రిక్ మెషీన్లలో రేషన్‌కార్డుదారుల వేలిముద్రలు పడకుంటే వారికి ఐరిష్ సహాయంతో రేషన్ అందజేయనున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
41 /27

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వేడిగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికం.

న్యూస్‌రీల్

ప్రథమ చికిత్సలపై శిక్షణ



శిక్షణలు ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆడిటోరియంలో వివిధ అంశాలకు సంబంధించి ప్రథమ చికిత్సలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. పాముకాటు ప్రథమ చికిత్స, ఐవీని రోగికి ఏ విధంగా ఎక్కించాలి, దెబ్బలు, గాయాలకు కుట్టు వేయడం, చిన్న పిల్లలకు ఎక్కడెక్కడ ఇంజక్షన్ వేయాలి, బేస్ లైఫ్ సేవింగ్ తదితర అంశాల్లో వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. దీంతోపాటు మార్కాపురంలో కూడా ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఏడు బ్యాచ్‌లుగా ఒక్కో బ్యాచ్‌కు 80 మంది సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్‌ఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో మెళకువలు నేర్చుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సాల్మాన్‌రాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఇతర వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా రిమ్స్ ప్రసూతి విభాగంలో కాంప్రహెన్సీవ్ అబార్షన్ కేర్ విధానంపై పీహెచ్‌సీల వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. దీనిలో డాక్టర్‌లు శ్రీదేవి, స్వరాజ్యలక్ష్మి, పద్మజ,మాధవీలత తదితరులు ఉన్నారు.

పులి సంచరించిన ప్రాంతం పరిశీలన

అర్ధవీడు(కంభం): మండలంలోని నాగులవరం సమీపంలో కంభం చెరువులో పెద్దపులి సంచరిస్తుందని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం చెరువు నాగులవరం–మోహిద్దీన్‌పురం మధ్యలోని ప్రాంతం, పెద్దపులి వచ్చి నీళ్లు తాగివెళ్లిన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు పరిసరాల్లో ఉన్న పులిఅడుగులను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని పులి తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయి ఉంటుందని వారు తెలిపారు.

రాధ మర్డర్.. ట్విస్ట్‌లే.. ట్విస్ట్‌లు..

- సినిమాను తలపించేలా సస్పెన్సులు
- నాలుగు రోజుల్లోనే కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- పలు కోణాల్లో దర్యాప్తు
- భర్తే హత్య చేశాడని గుర్తింపు
- ఎవరికీ అనుమానం రాకుండా సీన్ క్రియేట్
- నిందితుడిని పట్టించిన సిమ్‌కార్డు
- సాక్షి కథనాలు అక్షర సత్యాలు

కనిగిరి రూరల్: వివాహిత రాధ హత్య కేసు.. అంతా థ్రిల్లింగ్.. సస్పెన్స్..ఎన్నో ట్విస్టులు.. పోలీసులకు సవాల్‌గా నిలిచింది. అవసరాల కోసం డబ్బును అప్పుగా తీసుకున్న స్నేహితుడే హత్య చేశాడని తొలుత ప్రచారం..ప్రాథమికంగా లభించిన ఆధారాలతో పోలీసులు కూడా ఆ దిశగా దర్యాప్తు..రెండు రోజుల పాటు ఏవేవో ప్రచారాలు..కిరాయి హంతకుల పైనా ఆరా తీశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు.. కొత్త సెల్‌సిమ్ ఆధారంగా సాగిన దర్యాప్తులో ఎవ్వరూ ఊహించని విధంగా కొత్త ట్విస్ట్.. స్నేహితుడు కాదు భర్తే హత్య చేశాడని తేలింది. అందరూ షాక్‌కు గురయ్యారు. స్నేహితుడి ముసుగులో చాట్ చేసి..ఎవరికీ అనుమానం రాకుండా సీన్ క్రియేట్ చేసి.. రాధను అంతమొందించాడు.. ఈ ఘటనలో 'సాక్షి' కథనాలు అక్షర సత్యాలుగా నిలిచాయి. రాధ దారుణ హత్య ఘటనలో సీన్..టు సీన్ ఇలా..

☛ వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడు గ్రామానికి చెందిన మేడం సుధాకర రెడ్డి కుమార్తె రాధకు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మండల కేంద్రం కోదాడకు చెందిన కోట కృష్ణా రెడ్డి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోట మోహన్ రెడ్డితో వివాహమైంది. వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జిల్లెళ్లపాడు గ్రామానికి చెందిన కాశిరెడ్డి, రాధ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు..కాశిరెడ్డి కూడా హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యాపారం నిమిత్తం వీరి ఇద్దరి దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నాడు. వీరి వద్ద సుమారు రూ.1.27 కోట్లు అప్పు చేశాడు. అప్పు తీర్చకపోవడం..ఐపీ నోటీస్ పంపడంతో రాధ, మోహన్‌రెడ్డిల మధ్య మనస్పర్ధలు మొదలయ్యాయి.. రాధపై అనుమానం పెంచుకుని హత్య చేసేలా కక్ష పెంచుకున్నాడు..పథకం ప్రకారం పక్కాగా వ్యవహరించాడు.

☛ రాధ ఊర్లో జరిగే అమ్మవారి కొలువులే తన పథకానికి అనుకూలంగా మార్చుకున్నాడు..స్నేహితుడి పేరుతో సిమ్‌లు మారుస్తూ భార్యతో చాటింగ్ చేశాడు..కాశిరెడ్డి డబ్బు ఇస్తాడంటూ 17వ తేదీ సాయంత్రం రాధ జిల్లెళ్లపాడుకు వెళ్లింది. చిన్న కొడుకుని బాబాయ్ ఇంట్లో దించి. బజారులో షాపింగ్ చేసింది. రాత్రి ఏడుగంటల వరకూ సీసీ కెమెరాల్లో రాధ కదలికలు కనిపించాయి. పామూరు బస్టాండ్‌లో ఉన్న సమయంలో వచ్చిన కారు ఎక్కిన తర్వాత ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. రాత్రి రాధ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి 12.50కి ఫోన్ లోకేషన్ గుర్తించారు. జిల్లెళ్లపాడు అడ్డరోడ్డు వద్ద రాధ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

☛ మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డబ్బులు ఇస్తానని స్నేహితుడు కాశిరెడ్డి చెప్పడంతో రాధ కనిగిరికి వెళ్లిందని కుటుంబ సభ్యులు చెప్పారు. కాశిరెడ్డే స్నేహితురాలు రాధను హత్య చేశాడని అందరూ భావించారు. పోలీసులు సైతం ఆ దిశగా దర్యాప్తు చేశారు. కేసులో ఎలాంటి పురోగతి లేదు. 17వ తేదీ మధ్యాహ్నం రాధ భర్త, కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని కోదాడకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. మోహన్‌రెడ్డి కూడా ఏమీ తెలియనట్టుగా పాల్గొన్నాడు.. ఎవరూ అనుమానం రాకుండా అతను కూడా కాశిరెడ్డిపైనే ఆరోపణలు చేశాడు.

☛ 18వ తేదీన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త సిమ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సిమ్ హతురాలు రాధ భర్త మోహన్‌రెడ్డిదిగా గుర్తించారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేయగా హత్యకు సంబంధించిన చిక్కుముడి వీడి పోయింది. మరో మూడు రోజుల పాటు లోతుగా దర్యాప్తు చేశారు. అందరూ షాక్‌కు గురయ్యే విషయాలు వెల్లడయ్యాయి. స్నేహితుడికి డబ్బుసాయం సంసారంలో చిచ్చురేపింది. అది అనుమానంగా మారి హత్యకు దారి తీసింది.



భార్య రాధ, పిల్లలతో మోహన్‌రెడ్డి (ఫైల్)

విచారణలో తేలిందిలా..

☆ రాధను హత్య చేసేందుకు పన్నాగం పన్నిన మోహన్‌రెడ్డి.. కాశిరెడ్డి పేరుతో ఫేక్ మెసేజ్‌లు పెట్టి చాటింగ్ చేసి నిర్ధారించుకుని, 13వ తేదీ కనిగిరికి ఒంటరిగా రావాలని మెసేజ్ పెట్టాడు. రాధ దానికి పూర్తిగా స్పందించలేదు.

☆ తిరిగి 15వ తేదీ మళ్లీ ఫేక్ మెసేజ్‌లతో చాటింగ్ చేశాడు. (హైదరాబాద్‌లోని మార్గ మధ్యంలో సంగారెడ్డి నుంచి పఠాన్ చెరువుకు వెళ్లే దారిలో చెరుకు రసం అమ్మే మహిళ ఫోన్ తీసుకున్నాడు. ఆ ఫోన్‌లోని సిమ్‌ను తస్కరించి.. కాశిరెడ్డి చేసినట్లు ఫోన్ మెసేజ్ చాటింగ్ చేశాడు)

☆ 16న హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో లాంగ్ డ్రైవ్ రెంటెడ్‌కార్‌ను తీసుకున్నాడు. కనిగిరిలో కలుద్దాం రమ్మని కాశిరెడ్డిలా రాధకు మెసేజ్‌లు పెట్టాడు. రాత్రికి ఒంగోలులో బసచేశాడు.

☆ 17న ఒంగోలు నుంచి మోహన్‌రెడ్డి సాయంత్రం నాలుగు గంటలకు కనిగిరికి చేరాడు.

☆ ఈ మధ్యలో భార్య రాధతో కాశిరెడ్డిలా మోహన్‌రెడ్డి ఫోన్ మెసేజ్‌లో చాటింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రాధ సాయంత్రం 6 గంటలకు కనిగిరి వచ్చింది.

☆ గం.6.47 కు రాధ ఉన్న స్థలానికి భర్త మోహన్‌రెడ్డి కారులో వచ్చాడు. ఒక్క సారిగా కాశిరెడ్డి స్థానంలో భర్తను చూసిన రాధ అవాక్కైంది. కొద్ది సేపటికి కారులో ఎక్కించుకున్నాడు.

☆ ఆ తర్వాత రాధను కారులో తీసుకెళ్లిన భర్త మోహన్‌రెడ్డి .. ఎన్‌హెచ్ 565 రోడ్డు మాచవరం సమీపంలోని డిగ్రీ కళాశాల వద్దకు తీసుకెళ్లి ఇద్దరు మాట్లాడుకున్నారు.

☆ ఈ క్రమంలో రాధకు బాబాయి, నాన్న దగ్గర నుంచి పలు ఫోన్లు వచ్చాయి. అయినా లిఫ్ట్ చేయలేదు. అక్కడ ఇద్దరికీ కారులో వాగ్వాదం జరిగింది.



రాధ మృతదేహం (ఫైల్)

☆ సుమారు రాత్రి 9 నుంచి 10 గంటల సమయంలో ఒక్కసారిగా రాధపై భర్త మోహన్‌రెడ్డి దాడి చేసి చున్నీతో గొంతు నులిమి, గట్టి కొట్టి చంపాడు.

☆ 11 గంటల సమయంలో అదే కారులో వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడు సమీపంలో క్రాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లి పడేశాడు.

☆ రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు కారును భార్య శవంపై ఎక్కించాడు.

☆ రాధను హత్య చేసిన భర్త ఒంటిపై బంగారు నగలను సైతం తీసుకుని వెళ్లాడు.

☆ కారును పూర్తిగా శానిటైజర్‌తో కడిగి మరీ.. అత్యంతంగా వేగంగా మిర్యాలగూడ చేరాడు. తిరిగి మరో కారులో తల్లిదండ్రులతో 18న కనిగిరికి చేరాడు. అమాయకంగా వ్యవహరించి, కాశిరెడ్డినే తన భార్యను చంపినట్లు అందర్నీ నమ్మించాడు. కోదాడ స్వగ్రామం తీసుకెళ్లి దహన సంస్కారాలు చేశాడు.

☆ 19వ తేదీ రాత్రికి సాంకేతిక ఆధారంగా, ఐటీ కోర్ టీం, దర్యాప్తు బృందాల సమాచారంతో కేసు మలుపు తిరిగింది. అదే రోజు భర్త మోహన్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

☆ 20, 21 తేదీల్లో సమగ్ర విచారణతో భర్త మోహన్‌రెడ్డి ఒక్కడే భార్య రాధను హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చారు.

☆ చివరకు మోహన్‌రెడ్డి వాడిన సిమ్‌కార్డే అతడిని పట్టించింది. మిస్టరీ వీడిపోయింది.

ఆటలపై ఆసక్తితోనే పతకాల పంట

ఒంగోలు: చిన్నతనం నుంచి ఆటలంటే మక్కువ.. వివాహమై, ఇద్దరు పిల్లలున్నా ఆటలపై ఆసక్తితోనే తిరిగి ఆడటం ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలిగానని ఏషియన్ పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్ 2023లో బంగారు పతకం సాధించిన కల్లు రాజేశ్వరి అన్నారు. దక్షిణ కొరియాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఏషియన్ పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్ 2023లో పాల్గొని డిస్కస్‌త్రో విభాగంలో బంగారు పతక విజేతగా నిలిచి సోమవారం ఒంగోలుకు చేరుకున్న కల్లు రాజేశ్వరిని ఆమె స్నేహితులు, బంధువులు, క్రీడాభిమానులు ఘనంగా స్వాగతించారు. ఒంగోలు రైల్వేస్టేషన్ నుంచి ఆమె నివాసమైన సమతానగర్ వరకు భారీగా ఊరేగింపు నిర్వహించారు. రాజేశ్వరి డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించడమే కాకుండా 5 కిలోమీటర్ల పరుగులో కూడా రజత పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా తన నివాసంలో కల్లు రాజేశ్వరి మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆటలంటే మక్కువ అని, పలు రాష్ట్ర, జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. తనకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. ఆటల పట్ల ఆసక్తి తగ్గకపోవడంతో తిరిగి భర్త సహకారంతో ఆడటం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించగలిగామన్నారు. దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ పసిఫిక్ మాస్టర్ గేమ్స్ 2023లో అర్హత సాధించాని, ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారన్నారు. ఇందుకు బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కల్లు రాజేశ్వరిని అభినందించిన వారిలో పాన్ ఇండియా స్పోర్ట్స్ సెక్రటరీ దాసరి భాస్కరరావు, ఏపీసీపీడీసీఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టంగా సాంబశివరావు, కార్యదర్శి బెల్లంకొండ సురేష్, ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు కేవీ రవి, కోశాధికారి పున్నారెడ్డి, రంగుల ఆర్ట్స్ ప్రతినిధి రంగుల సంధ్య, కల్లు రాజేశ్వరి కుటుంబ సభ్యులు ఉన్నారు.



బంగారు పతక విజేత కల్లు రాజేశ్వరిని ఘనంగా సత్కరిస్తున్న స్నేహితులు, బంధువులు

ఒరిగిన కథా శిఖరానికి కన్నీటి నివాళి

- ప్రముఖ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డికి నివాళులర్పించిన సాహితీవేత్తలు
- విశ్వనాథరెడ్డికి జిల్లాతో విడదీయరాని అనుబంధం



కేతు విశ్వనాథరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న రచయితలు



ఒంగోలులో ప్రరసం రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి (ఫైల్)

ఒంగోలు టౌన్: కథారచయితగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యంలో తనదైన బలమైన ముద్ర వేసుకున్న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మరణం తెలుగు సాహితీ ప్రపంచాన్ని విషాదంలో ముంచింది. విశ్వనాథరెడ్డి పుట్టి పెరిగింది వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం రంగశాయిపేట అయినా ఆయనకు ప్రకాశం జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన విద్యావేత్తగా, రచయితగా, విమర్శకుడిగా ఎన్నో శిఖరాలను అధిరోహించారు. అయినా ఆయన తన మూలాలు ఎన్నడూ మరిచిపోలేదు. తొలినాళ్లలో జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించిన విశ్వనాథరెడ్డి తర్వాత ప్రభుత్వ కొలువులో అధ్యాపకుడిగా చేరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరులో కొంతకాలం డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆయన జిల్లాలోని కమ్యూనిస్టు నాయకులతో, కవులు, రచయితలతో సన్నిహితంగా ఉన్నారు. 2003లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం సభలో ముఖ్య అతిథిగా ఆయన చేసిన ప్రసంగం జిల్లా రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రాయలసీమ ప్రజల కథల వెనకాల ఉన్న వెతల్ని ఆయన ఆవిష్కరించిన తీరు గురించి అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. ఓ పక్క ఉద్యోగం చేస్తూనే జిల్లాలో అనేక ఉద్యమాలలో ఆయన పాలుపంచుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం కాగా పెద్ద కుమార్తె మాధవీ లత కొద్ది కాలంగా ఒంగోలులో నివాసం ఉంటున్నారు. విశ్వనాథరెడ్డి సతీమణి పద్మావతికి అనారోగ్యంగా ఉండడంతో ఆయన కొంత ఒత్తిడికి గురయ్యారు. చికిత్స కోసం ఒంగోలుకు వచ్చారు. శనివారం పద్మావతిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం సోమవారం తెలవారుజామున ఆయనకు గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మరణించారు. కేతు మరణవార్త తెలిసిన వెంటనే ఒంగోలులోని సాహితీవేత్తలు, గుంటూరు, విజయవాడ, కడప నుంచి అరసం నాయకులు, రచయితలు వెంటనే ఒంగోలులోని హాస్పిటల్‌కు తరలి వచ్చారు. అంబేడ్కర్ యూనివర్శిటీలో డైరక్టర్‌గా రిటైర్డ్ అయిన తరువాత ఆయన కడపలో నివాసం ఉంటున్నారు. విశ్వనాథరెడ్డి మృతితో తెలుగుతల్లి తన ముద్దుబిడ్డను కోల్పోయిందని, రాయలసీమ కథ కన్నీరు పెడుతుందని పలువురు సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

విషాదంలో సాహితీ ప్రపంచం

విశ్వనాథరెడ్డి మరణ వార్త విన్న పలువురు కవులు, రచయితలు ఒంగోలులో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కె.శరత్, ప్రముఖ మార్క్సిస్ట్ విశ్లేషకులు తుంగా లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, సీపీఐ సీనియర్ నాయకుడు ఎం.వెంకయ్య, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొన్నూరు శ్రీనివాసులు, యత్తపు కొండారెడ్డి, ప్రముఖ కవి శ్రీరామకవచం సాగర్ తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, తెలంగాణ అమరవీరుల ట్రస్టు కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

పురస్కారాలకు వన్నె తెచ్చిన రచయిత

కరువు సీమ రాయలసీమలో తనివితీరా కురిసిన వర్షం లాంటి గొప్ప రచయిత కేతు విశ్వనాథరెడ్డి. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు ఎన్నటికీ మరచిపోలేం. అరసం అధ్యక్షుడిగా పని చేసిన ఆయన రాయలసీమ కథలకు ముఖచిత్రం లాంటి కవి.

– పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం జాతీయ కార్యదర్శి

రైతులు, శ్రామికుల పక్షపాతి

రాయలసీమ అంటేనే కరువు నేల అనేది అందరికీ తెలిసిందే. రైతుల వెతలు, శ్రామికుల కలతలను కథలుగా రికార్డు చేసి తెలుగు సాహిత్యంలో ఆవిష్కరించారు. కేవలం రచనలకే పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాలతో మమేకమైన గొప్ప రచయిత.

– జి.ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

సిద్ధాంతానికి కట్టుబడిన గొప్ప రచయిత

వామపక్ష భావజాలంతో జీవితాన్ని ప్రారంభించి తుదిదాకా అదే సిద్ధాంతానికి కట్టుబడిన రచయిత. ఆయన రాసిన కథలు అనేక భాషల్లోకి అనువాదం కావడమే కాకుండా ఎంతో చర్చకు దారితీశాయి. నేటి తరానికి ఆయన ఒక పాఠ్యాంశం.

– నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు

తెలుగు సాహిత్యానికి కండపుష్టి

కేతు విశ్వనాథరెడ్డి కథకుడిగా ఆజానుబాహుడు. ఆయన తెలుగుకథకు కండపుష్టి, తెలుగు సాహిత్యానికి అక్షరపుష్టి లాంటివారు. ఆయన రాసిన అమ్మవారి నవ్వు కథ ఎంతో సంచలనం సృష్టించింది. ఆ కథని ఎంతో మంది రచయితలు తమ సొంతగొంతుతో వినిపించారు. ఆయనకు ఎంతో మంది శిష్యులు ఉన్నారు.

– శ్రీరామకవచం సాగర్, ప్రముఖ కవి



లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం కంకణాలపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం కంకణాలపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంత్రి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద, మధ్యతరగతి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఆయన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మంచి పాలన అందిస్తూ ప్రగతి పథాన నడిపిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ వారి కోసం మాత్రమే పనిచేసిందని విమర్శించారు. ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని తెలిపారు. నవరత్నాల ద్వారా లబ్ధిదారులందరికీ మేలుచేసిన ప్రభుత్వం తమదన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పారదర్శకంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకుంటే సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. వలంటీర్లు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ కే తులసి మల్లికార్జున నాయక్, ఏఓ కే నీరజ, ఏపీఓ సుజాత, ఏపీఎం కృపమ్మ, ఈఓఆర్‌డీ మురళీ మోహన్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది

- త్రిపురాంతకంలో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం

త్రిపురాంతకం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకం ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలేవీ మారవని యధావిధిగా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. 175 సీట్లకు 175 సీట్లు క్లీన్ స్వీప్ చేస్తారన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు ఓడిపోతాడా అని ఓ విలేకరి ప్రశ్నించగా ఆయన నియోజకవర్గమేదో, ఎక్కడ నుంచి పోటీ చేస్తాడో ముందు ప్రకటించనివ్వండి అన్నారు.

ఆలయాల్లో స్పీకర్ సీతారాం ప్రత్యేక పూజలు

బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈఓ చెన్నకేశవరెడ్డి, అర్చకులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, స్వామివారి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పండితులు ఆశీర్వచనం అందించారు. ఈయన వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, దేవాలయాల ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు మల్లికార్జున్ నీటిసంఘం మాజీ అధ్యక్షుడు నక్కా చిన్న త్రిపురారెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, కుటుంబ సభ్యులు

ప్రజలకు చేరువలో పరిపాలన

- స్పందనలో కలెక్టర్ దినేష్ కుమార్

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనను ప్రజలకు చేరువ చేయాలనే సదుద్దేశంతో నియోజకవర్గాల స్థాయిలో స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తోందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పర్యవేక్షణలో సోమవారం పట్టణంలోని నంద్యాల రోడ్డులోని చీతిరాల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పందనకు ఆరు మండలాల నుంచి వివిధ సమస్యలపై 416 అర్జీలు వచ్చాయి. రేషన్ కార్డులు, మ్యుటేషన్లు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి. పట్టణంలోని కాశిరెడ్డి కుంట ఆక్రమణకు గురైనట్లు బండారు జనార్దన్‌రెడ్డి అర్జీ ఇచ్చారు. పట్టణంలోని సగిలేరు వాగు అభివృద్ధి కోసం స్థానిక కౌన్సిలర్లు అర్జీలు ఇవ్వగా అభివృద్ధి కోసం రూ.21 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, మంజూరైతే వెంటనే పనులు చేపడతామని ఇరిగేషన్ డీఈ జయరామయ్య తెలిపారు. కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య మండలంలోని ప్రధానోపాధ్యాయుడు ప్రొటోకాల్ పాటించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ఏపీడీఏఎస్‌సీఏసీ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే అన్నారాంబాబు చేతుల మీదుగా లబ్ధిదారులైన 9 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిళ్లను ఉచితంగా అందజేశారు. ఒక్కో వాహనం విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వికలాంగులు మూడు చక్రాల మోటర్ సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్స్ ద్వారా కంభంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ పొందిన యువతీ యువకులకు కోర్సు పూర్తి చేసుకున్న సర్టిఫికెట్లను అందజేశారు. నైపుణ్యం పొందిన యువతీ యువకులు వారి వృత్తుల్లో ప్రతిభ కనబరుస్తూ ఉజ్వల భవిష్యత్తు సాధించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం నైపుణ్యం కలిగిన యువతీ యువకులకు చేయూతనిస్తోందన్నారు. ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో జేసీ డా.శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, ట్రైనీ ఎస్పీ అంకితాసురానా, జిల్లా నైపుణ్యాధికారి ఆర్.లోకనాథం, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామసుబ్బయ్య, గిద్దలూరు తహశీల్దార్ కె.విజయకుమారి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడు బలవన్మరణం

గిద్దలూరు రూరల్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని వివేకానంద కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గిద్దలూరులోని ఏబీఎం పాలేనికి చెందిన మట్టా రమేష్(30) మానసిక వేదనకు గురై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. నంద్యాల జీఆర్పీఎఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

వినుకొండ(నూజెండ్ల/పల్నాడు జిల్లా) : మండల పరిధిలోని రవ్వవరం కొండ గురునాథ స్వామి దేవాలయం వద్ద అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఐనవోలు పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామస్తుడైన గోపిరెడ్డి వెంకటేశ్వర్లు (70) తన పంచెతో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులతో కలసి మృతుడు విజయవాడలోని గొల్లపూడిలో నివాసం ఉంటున్నాడని, అయితే మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు వెల్లడించారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాశీం, రైటర్ సురేష్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు అర్చన ఎంపిక


వాయిల అర్చన

సింగరాయకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పాకల పంచాయతీ చెల్లెమ్మగారిపాలేనికి చెందిన విద్యార్థిని వాయిల అర్చన ఎంపికైంది. ఈనెల 21, 22వ తేదీల్లో విజయనగరం రాజీవ్‌గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్చన అత్యుత్తమ ప్రతిభ కనబరచింది. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో అర్చన ప్రాతినిధ్యం వహిస్తుందని పాకల హైస్కూల్ పీడీ పి.హజరత్తయ్య తెలిపారు.

శభాష్.. పోలీస్


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ కె.శ్రీనివాసరావు, వెలిగండ్ల ఎస్సై మహేష్‌కుమార్, వెలిగండ్ల కానిస్టేబుల్ వెంకయ్య..

ఒంగోలు టౌన్: వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడులో వివాహిత కోటా రాధ హత్య కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశంస పత్రాలు అందజేశారు. పామూరు ఎస్సై సురేష్‌ను కూడా ఎస్పీ అభినందించారు

చిత్తశుద్ధితో స్పందించండి

- పరిష్కరించలేని సమస్యలకు కారణాలు వివరించాలి
- అధికారులకు డీఆర్ఓ శ్రీలత సూచన
- కలెక్టరేట్ స్పందనలో అర్జీల స్వీకరణ


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సహేతుకంగా, చిత్తశుద్ధితో పరిష్కరించాలని అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించినపుడే ప్రజలు సంతోషంగా ఉంటారని చెప్పారు. అర్జీల పరిష్కారం మొక్కుబడి తంతుగా మార్చవద్దని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. పరిష్కారం కాని సమస్యలుంటే అర్జీదారులను పిలిచి వారికి అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, ఉమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేలిముద్రలు పడకుంటే ఐరిష్

- ఎండీయూ ఆపరేటర్లకు ఐరిష్ యంత్రాలు పంపిణీ


ఎండీయూ ఆపరేటర్లకు ఐరిష్ యంత్రాలు అందచేస్తున్న అధికారులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకులను మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ఇంటింటికీ అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే సరుకుల పంపిణీకి సంబంధించి కార్డుదారులు బయోమెట్రిక్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేయాలి. కొంతమంది కార్డుదారుల వేలిముద్రలు బయోమెట్రిక్‌లో పండకుండా కొంత ఇబ్బంది కలుగుతూ పలుసార్లు ప్రయత్నించాల్సి వచ్చేది. పేదలకు నిత్యావసరాలు ఎట్టి పరిస్థితుల్లో అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వేలిముద్రలు పడని కార్డుదారులకు ఊరట కలిగిస్తూ ఐరిష్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐరిష్ యంత్రాలను ఎండీయూ ఆపరేటర్లకు పంపిణీ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి ఐరిష్ యంత్రాలు ఎండీయూ ఆపరేటర్ల వద్ద అందుబాటులో ఉండి వేలిముద్రలు పడని కార్డుదారులకు ఐరిష్ ద్వారా బయోమెట్రిక్ పూర్తి చేసి సరుకులు అందచేస్తారు. జిల్లాలో ఉన్న 385 మంది ఎండీయూ ఆపరేటర్లకు ఈ పరికరాలు అందచేశారు. ఐరిష్ పరికరాల పంపిణీలో తహసీల్దార్ మురళి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రామకృష్ణ, అశోక్, రామానాయుడు, ఎండీయూ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్న లేఅవుట్లను పరిశీలించిన జేసీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసకుమార్

కొమరోలు: మండలంలోని దద్దవాడలో జగనన్న లేఅవుట్లను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసకుమార్ సోమవారం పరిశీలించారు. మండలంలోని దద్దవాడ గ్రామానికి చెందిన కొంతమంది లబ్ధిదారులకు దూరంలో ఉన్న అలసందలపల్లె గ్రామం వద్ద జగనన్న లేఅవుట్లను వేసి స్థలాలను కేటాయించారు. కానీ ఆ ప్రాంతంలో గృహాలను నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సుముఖత చూపించకపోవడంతో అదే విషయాన్ని అధికారులకు లబ్ధిదారులు తెలియచేశారు. విషయాన్ని తహసీల్దార్ రమాదేవి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో జేసీ శ్రీనివాసకుమార్, మార్కాపురం సబ్‌కలెక్టర్ శేతుమాధవన్ సోమవారం దద్దవాడ గ్రామంలోని 131/8 సర్వే నెంబరులో 62 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసకుమార్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిశీలించిన 62 సెంట్ల స్థలంలో జగనన్న గృహాలను నిర్మించుకునే అవకాశం ఉందో, లేదో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ మలికాగర్గ్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించగా మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయి. నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ.. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నాగులప్పలపాడుకు చెందిన కె.పెరేష్‌బాబు తమ వద్ద నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నాడని, ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే బెదిరిస్తున్నాడని కొత్తపట్నం, టంగుటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఎమ్మెల్యే టీజేఆర్

- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

నాగులుప్పలపాడు: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో సోమవారం జగనన్న సుపరిపాలనలో మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో 80 శాతం ముందంజలో ఉందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు చేయలేని అభివృద్ధిని సీఎం వైఎస్ జగనన్న తన నాలుగేళ్ల పాలనలో చేశారన్నారు. అభివృద్ధిలో సంతనూతలపాడు నియోజకవర్గం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించి, సమస్యలు తెలుసుకునేందుకు మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలంలో సంక్షేమ పథకాల ద్వారా 4,969 మందికి 782 కోట్లు, గృహనిర్మాణం ద్వారా 2,143 మందికి రూ.863 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి డా.యాదాల అశోక్‌బాబు, మండల కన్వీనర్ శ్రీమన్నారాయణ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కె.విజయ్‌కుమార్, పెనుబోతు రంగారావు, మారెళ్ల శేషయ్య, పరంధామిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో డీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2021–23 బ్యాచ్ రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను విద్యార్థులు తాము విద్యనభ్యసిస్తున్న కాలేజీలో పరీక్ష ఫీజు రూ.150 అపరాధ రుసుం లేకుండా ఈనెల 26వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. 3 సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రూ.50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని స్పష్టం చేశారు.

కారు బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

- త్రిపురాంతకం మండలం డీవీఎన్ కాలనీ సమీపంలో ఘటన

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం డీవీఎన్ కాలనీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కర్నూలుకు చెందిన విజయ్, రఘుపతి, మహేశ్వరితో పాటు మరొకరు విజయవాడ వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి నిద్రపోతూ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై తూలి పడటంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి హైవే అంబులెన్స్‌లో వినుకొండ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

స్టేట్ యూత్ మెన్ బాక్సింగ్ చాంప్ విశాఖ

- రన్నరప్‌గా విజయనగరం
- లైట్ వెల్టర్, హెవీ వెయిట్ విభాగాల్లో ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా యువకులు

విశాఖ స్పోర్ట్స్: 6వ యూత్ మెన్ అంతర జిల్లాల బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. విజయనగరం జట్టు 14 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. డీఆర్ఎం కప్ పేరిట రైల్వే బాక్సింగ్ హాల్‌లో 13 వెయిట్ కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. బెస్ట్ బాక్సర్‌గా బాంటమ్ వెయిట్‌లో వి.పవన్(అనంతపురం) నిలవగా... బెస్ట్ లూజర్‌గా బాంటమ్ వెయిట్‌లోనే బి.ప్రసాద్(విశాఖ) నిలిచాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యూత్ బాక్సర్లు పోటీ పడగా.. ఆయా కేటగిరిల్లో విజేతగా నిలిచిన బాక్సర్లను ఏపీ యూత్ మెన్ జట్టుగా ఎంపిక చేసి త్వరలో జరగనున్న అంతర్రాష్ట్ర మెన్ యూత్ చాంపియన్‌షిప్‌కు అర్హత కల్పించనున్నారు. ఫైనల్ లూజర్లు స్టాండ్‌బైగా నిలవనున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

విజేతలు వీరే...

57–60 కేజీల లైట్ వెయిట్ కేటగిరిలో పి.దిగ్విజయ్(విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఎల్.వాసు(నెల్లూరు) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. కె.సిద్దిక్(ప్రకాశం), గగన్ శ్రీహర్ష(కడప) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.

60–63.5 కేజీల లైట్ వెల్టర్ వెయిట్ కేటగిరిలో జె.భానుప్రకాష్ (విశాఖ) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా షేక్ మహ్మద్ ఆసిఫ్(ప్రకాశం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు. నందగోపాల్(పశ్చిమగోదావరి), వేణుమాధవ్(శ్రీకాకుళం) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలందుకున్నారు.

86–92కేజీల హెవీ వెయిట్ కేటగిరిలో బి.చంద్రశేఖర్(విజయనగరం) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకోగా ఆషిక్ గౌస్(ప్రకాశం) ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకాన్ని అందుకున్నాడు.

ఖోఖోలో ప్రకాశం జట్టుకు ద్వితీయ స్థానం


బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రకాశం జట్టు

- ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానం చేజిక్కించుకోగా, తూ.గో జిల్లా జట్టు ద్వితీయ స్థానం, విశాఖ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ప్రకాశం ద్వితీయ, విశాఖ జిల్లా జట్టు తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నాయి. విజేతలకు విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, సెట్విజ్ సీఈఓ బి.రామ్ గోపాల్, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, డీవీఈఓ కె.సురేష్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

బీమా పథకంతో పాడి రైతులకు మేలు

- పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి


రికార్డులు పరిశీలిస్తున్న బేబీరాణి

పొదిలి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పథకంతో పాడి రైతులకు మేలు చేకూరుతుందని పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి పేర్కొన్నారు. సోమవారం ఆమె స్థానిక పశువైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలన అనంతరం నూతన బీమా పథకం గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారుల వాటా 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారుల వాటా 50 శాతంగా ఉంటుందన్నారు. గరిష్టంగా ఒక కుటుంబానికి చెందిన 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు పశు వైద్యశాలలు, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వేణు పాల్గొన్నారు.